## క్లుప్తంగా

### విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



విద్యార్థులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్

**బంట్వారం:** విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం కోట్‌పల్లి మండల కేంద్రంలోని విజేత టాలెంట్ స్కూల్ వార్షికోత్సవంలో స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలంటూ ఆయన ఆకాంక్షించారు. క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ప్రతిరోజు దినపత్రికలు, పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ వెంకట్‌రాంరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా థారాసింగ్‌జాదవ్



నూతన కమిటీ ప్రతినిధులను సన్మానిస్తున్న సభ్యులు

**తాండూరు:** అథ్లెటిక్ అసోసియేషన్ వికారాబాద్ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. తాండూరు పట్టణంలోని చైతన్య జూనియర్ కళాశాలలో జరిగిన ఎన్నికలకు పరిశీలకులు గోపాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డిల సమక్షంలో నిర్వహించారు. వికారాబాద్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా థారాసింగ్ జాదవ్ (జెడ్పీటీసీ మాజీ సభ్యుడు), ఉపాధ్యక్షుడిగా లొంకనర్సింహులు, గౌరిశంకర్, నరేందర్‌నాయక్, ట్రెజరర్‌గా రాములు, ప్రధాన కార్యదర్శిగా మధు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాములు ఎన్నికయ్యారు. అనంతరం అసోసియేషన్ నూతన కమిటీ ప్రతినిధులను సభ్యులు ఘనంగా సన్మానించారు. అంతే కాకుండా ఇటీవల పదవి విరమణ పొందిన ఫిజికల్ డైరెక్టర్ గౌరిశంకర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు సుమిత్ర, రాథోడ్, గోపాల్, హరికృష్ణ, మధు, బుగ్గప్ప, రాధాకృష్ణ, రవికుమార్, అజీజ్, బాలమణి, మల్లేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

**యాలాల:** మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2008 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి హెచ్‌ఎం సిద్రామేశ్వర్ అధ్యక్షత వహించారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను ఆత్మీయంగా పలకరించి ఘనంగా సన్మానించారు. నాడు విద్యార్థులుగా ఉన్నప్పుడు వారు చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులు ఆనందం, మనోహర్, శాంతప్ప, సర్దార్, బాలయ్య, సావిత్రమ్మ తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాయిలుగౌడ్, అశోక్, నర్సింహులు, నరేశ్, అంజి, పద్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య పరిష్కరించాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్



మహిళలతో మాట్లాడుతున్న శ్రీనివాస్

**తాండూరు:** మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం నాయకులతో కలిసి రెండో వార్డును సందర్శించారు. పేదల కాలనీ కావడంతో ప్రభుత్వ అధికారులు తాగునీటి సరఫరా చేయడం లేదంటూ స్థానిక మహిళలు సీపీఎం నాయకుల ఎదుట మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. తాండూరు మున్సిపాలిటీలో తాగునీటి సమస్య, పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వానంగా మారిందన్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో మురుగు వీధుల్లోకి చేరుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెండో వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు.

# అక్షరాలు నేర్చేదెలా..?

- ఆగిపోయిన సాక్షరభారత్ పథకం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు



సాక్షరభారత్ కేంద్రంలో చదువుకుంటున్న మహిళలు (ఫైల్)

**దౌల్తాబాద్:** నిరక్ష్యరాస్యతను నిర్మూలించాలనే ఉద్దేశంతో గతంలో ప్రభుత్వం సాక్షరభారత్ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఆయా గ్రామాల్లో సాక్షరభారత్ కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామానికి కోఆర్డినేటర్లు కూడా నియమించారు. ఈ కేంద్రాల్లో నిరక్షరాస్యులు చదువుకునేవారు. ఈ పథకాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018లో ఆపేసింది. మండలంలో నిరక్ష్యరాస్యులుగా గిరిజనులే ఎక్కువగా ఉన్నారు. ఆయా గ్రామాల్లో చాలా మంది చదువును మధ్యలోనే ఆపేశారు. సాక్షరభారత్‌తో కొంతమేర చదువుకుని ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించారు. ప్రస్తుతం సాక్షరభారత్‌ను ఆపేయడంతో నిరక్ష్యరాస్యులు అలాగే ఉండిపోయారు. కొత్తగా ×నవభారత్ సాక్షర॰ అనే కార్యక్రమాన్ని తీసుకొస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించినా ఆచరణకు నోచుకోలేదు. దీంతో సాక్షరభారత్ పథకానికి మంగళంపాడింది.

**నిలిచిన అమ్మా, నాన్నల చదువు..**

సాక్షరభారత్ పథకం 2009న ప్రారంభమైంది. దాదాపు తొమ్మిది సంవత్సరాల తరువాత 2018లో సాక్షరభారత్‌ను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆపేసింది. కేంద్రం నుంచి నిధులు నిలిచిపోవడంతో ఈ పథకానికి స్వస్తి చెప్పారు. నిరక్ష్యరాస్యులైన తల్లిదండ్రులకు అక్షరాలు నేర్పించాలని సూచించారు. ఇందుకోసం పిల్లలు, ఉపాధ్యాయులతో అధికారులు సమావేశాలు నిర్వహించారు. అప్పట్లో కరోనా రావడంతో పథకం అమలు జాడేలేదు.

**మహిళలే ఎక్కువ..**

మహిళల అక్షరాస్యత పెంపుపై ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మండలంలో నిరక్ష్యరాస్యుల్లో అధికభాగం అతివలే ఉన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం వయోజన విద్య, అక్షరకిరణం కార్యక్రమాలను చేపట్టింది. తర్వాత సాక్షరభారత్‌ను తీసుకొచ్చింది. ఈ కార్యక్రమాలతో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఖాళీగా ఉన్న సమయాల్లో, సాయంకాలం కొంత సమయాన్ని కేటాయించి చదువుకునే వారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినందునా ఈ పథకంపై దృష్టి సారించి అమలు చేస్తే మహిళల్లో నిరక్ష్యరాస్యత రేటును తగ్గించొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# సేవాగుణం అభినందనీయం



తాండూరు రూరల్: పెద్దేముల్‌లో పాఠశాల వేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**తాండూరు రూరల్:** సొంత డబ్బులు వెచ్చించి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు ద్యావరి నరేందర్‌రెడ్డి సేవాగుణం అభినందనీయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో రూ.1,80,000లతో నిర్మించిన పాఠశాల వేదికను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాజిక సేవలో ఉపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి ముందుటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సునీత, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ అంజయ్య, నారాయణరెడ్డి, నాయకులు శోభారాణి, ఎల్లారెడ్డి, నర్సిములు, ప్రవీణ్‌కుమార్, గోపాలకృష్ణ, జితేందర్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, విద్యాసాగర్, కృష్ణారెడ్డి, కిషన్‌రావు, ఆనంద్, శ్రీధర్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, బందెప్పలు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ



హస్నాబాద్‌లో నిర్వహించిన గ్రామసభ

- హస్నాబాద్‌లో రూ.36,53,807 పనులకు ఆడిట్
- వివరాలు వెల్లడించిన బీఆర్‌పీ డేవిడ్

**దుద్యాల్:** మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ సంబంధించిన గ్రామ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో లెవలింగ్, పండ్ల తోటల గుంతలు, పశువుల పాకలు వంటి వివిధ రకాల పనులకు సంబంధించి రూ.36,53,807ల పనులు జరిగాయి. దీనికి సంబంధించి నాలుగు రోజులుగా ఆడిట్ నిర్వహించారు. పనులు చేసిన ప్రతీ కూలీ ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో బ్లాక్ రీసోర్స్ పర్సన్ డేవిడ్ వివరాలు వెల్లడించారు. 54 రకాల పనులు నిర్వహించగా రూ.36,53,807లు ఖర్చు చేశారు. ఇందులో కూలీలు పనిచేసిన వాటికి రూ.56,956లు అందలేదని, పని చేయకున్నా డబ్బులు తీసుకున్నది రూ. 65,522లని నిర్ధారించారు. అందుకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. వెల్లడించిన వివరాల ప్రకారం గ్రామంలో 2023–2024 సంవత్సరంలో స్వల్ప అక్రమాలు జరిగినట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**దౌల్తాబాద్:** మండలంలోని బాలంపేట సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని బాలంపేట, సుల్తాన్‌పూర్, తిమ్మారెడ్డిపల్లి, బిచ్చాల, అంతారం గ్రామాల ప్రజలకు అంతరాయం కలగనున్నట్లు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు దీనికి సహకరించాలని కోరారు.

### ఉత్తరాదిమఠంలో ద్వితీయ వార్షికోత్సవం

**తాండూరు:** తాండూరు పట్టణంలోని ఉత్తరాది మఠం (రాఘవేంద్రస్వామి) దేవాలయంలో ఆదివారం ఆలయ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 7:30 గంటలకు జయతీర్థులు, రాఘవేంద్రస్వామి వార్ల మృత్తికా వృందావనాలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు పుష్పార్చన, శ్రీమన్యుసూక్త హోమం నిర్వహించారు. 10:30 గంటలకు పూర్ణాహుతి, జయరామ మహిళా భజన మండలి వారిచే లక్ష్మీశోభనే పఠనం చేశారు. ఈ ఉత్సవాలకు ఆలయ ఫౌండర్, ట్రస్టీ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటికొండస్వప్నపరిమళ్ కుటుంబ సమేతంగా హాజరై పూజలు నిర్వహించారు.

### ఎరుకల ఆశాజ్యోతి ఉషా కిరణ్

మహిళ సాధికారిత అవార్డు–2025కు ఎంపికపై హర్షం

**దుద్యాల్:** జాతీయ ఆదివాసి గిరిజన ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాలువాయి ఉషా కిరణ్ మహిళ సాధికారిత అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం ఎన్‌టీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎరుకలి రమేశ్ మాట్లాడుతూ వెనకబడిన ఎరుకల జాతిని మేల్కొలిపేందుకు ఉషా కిరణ్ చాలా కష్టపడ్డారని, ఎరుకల జాతికే గొప్ప అని పేర్కొన్నారు. చదువుకున్న వ్యక్తులను ప్రోత్సహిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఎంతో మంది ఎరుకల బిడ్డలకు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో సీట్లు ఇప్పించారని, పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తికి 2025 మహిళ సాధికారిత అవార్డు రావడం గర్వకారణమన్నారు. ఈ నెల 17న రవీంద్రభారతిలో ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేయనున్నారని తెలిపారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు బాధాకరం



పరిగి: జగదీశ్‌రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- మాజీ మంత్రి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో జగదీశ్‌రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మలు దహనం

**పరిగి:** స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు హన్మంతు ముదిరాజ్‌లు పేర్కొన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, కేటీఆర్‌ల దిష్టిబొమ్మను ఆదివారం బస్టాండ్ ఎదుట దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఈ విషయంలో జగదీశ్‌రెడ్డిని వెంటనే పార్టీ నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, తార్యానాయక్, రామకృష్ణరెడ్డి, శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

**దౌల్తాబాద్‌లో..**

**దౌల్తాబాద్:** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ మాజీ మంత్రుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ముందుగా రోడ్డుపై బైఠాయించి బీఆర్‌ఎస్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంకట్‌రెడ్డి, వీరన్న, వెంకట్రాములు, హన్మంతు, దస్తప్ప, నర్సప్ప, శరణయ్య, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పూడూరులో..**

**పూడూరు:** అనుచిత వాఖ్యలు చేయడం బీఆర్‌ఎస్ పార్టీకి తగదని డీసీసీ ఉపాధ్యక్షుడు కడుమూరు ఆనందం, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. మన్నేగూడ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. డీసీసీ కార్యదర్శులు పెంటయ్య, అజీమ్‌పటేల్, శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



పూడూరు: మన్నేగూడలో మాజీ మంత్రుల దిష్టిబొమ్మతో కాంగ్రెస్ నాయకులు

**దోమలో..**

**దోమ:** దోమ మండల కేంద్రంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నేతలు మాజీ మంత్రుల దిష్టిబొమ్మలను దహనం చేశారు.

**స్పీకర్‌ను అవమానించింది సొంత పార్టీ నేతలే..**

చట్ట సభలో జరిగిన చర్చలో భాగంగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్న మాటల కంటే స్పీకర్‌ను కులం పేరు ప్రస్తావించి, అతని విలువను తక్కువ చేసి మాట్లాడడం అధికార పార్టీ నేతలకే చెల్లిందని మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు.



కుల్కచర్లలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



దౌల్తాబాద్: అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



దోమ: దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

# తూముకు మరమ్మతులు చేపట్టండి

మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా

**యాలాల:** జుంటుపల్లి ప్రాజెక్టు కుడి, ఎడమ తూముకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా డిమాండ్ చేశారు. ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు ఆకుల శివకుమార్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రాంరెడ్డి తదితరులతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. ఎడమ తూముకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో నీరందడం లేదని పలువురు రైతులు వారితో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ..గతంలో రెండు సార్లు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రాజెక్టును సందర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. వెంటనే తూము మరమ్మతు పనులను చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారన్నారు. ఈ విషయం గురించి ప్రాజెక్టు వద్ద నుంచి ఎంపీ కొండాతో ఫోన్లో మాట్లాడారు. ఆయనకు పూర్తి వివరాలు వెల్లడించారు. దీనికి స్పందించిన ఎంపీ తూము మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని, మరమ్మతు ఖర్చులను తను సొంతంగా భరిస్తానని బాలేశ్వర్‌గుప్తాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్యానాయక్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తూము వివరాల గురించి ఎంపీతో ఫోన్లో మాట్లాడుతున్న బాలేశ్వర్‌గుప్తా

# యువత శంభాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి



శివాజీ యూత్ సభ్యులను సన్మానిస్తున్న కరణం ప్రహ్లాదరావు

బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు ప్రహ్లాదరావు

**కుల్కచర్ల:** యువత శంభాజీని స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు కరణం ప్రహ్లాదరావు పేర్కొన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల కేంద్రంలో ఇటీవల ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవిత చరిత్రకు సంబంధించి విడుదలైన చావా చిత్రాన్ని స్థానిక శివాజీ యూత్ సభ్యులు ఆదివారం ఏర్పాటు చేశారు. దీన్ని ప్రహ్లాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ యువత శంభాజీని స్ఫూర్తిగా తీసుకుని మరింత ముందుకు సాగాలన్నారు. ఆయన జీవిత చరిత్ర ఆధారంగా నిర్మించిన ఈ చిత్రాన్ని ప్రతి హిందూవు ప్రేరణగా తీసుకుని కట్టుబడి ఉండాలన్నారు. ఈ చిత్రాన్ని చూసిన తర్వాత శివాజీ యూత్ యువకులను అభినందించి శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్, మాజీ సర్పంచ్ రామలింగం, నేతలు వెంకట్‌రెడ్డి, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌తోనే పల్లెలు అభివృద్ధి

**తాండూరు రూరల్:** స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషితో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిట్టిఘనాపూర్‌లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేపట్టిన సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ..చిట్టిఘనాపూర్ అభివృద్ధికి ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పటేల్ బసిరెడ్డి, జగ్గు పటేల్, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్, మహేష్, బసప్ప, బసిరెడ్డిలు పాల్గొన్నారు.

**దౌల్తాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పల్లెల్లో అభివృద్ధి జరుగుతుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రావు పేర్కొన్నారు. ఆదివారం తిమ్మారెడ్డిపల్లి–సుల్తాన్‌పూర్, మామిడికుంట–మామిడికుంట తండా, ర్యాలగుట్ట తండాలకు మంజూరైన బీటీ రోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ కొడంగల్ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి సీఎం కావడం ఎంతో గర్వకారణమన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాములు, నర్సిములు, సేవ్యానాయక్, వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్, వీరన్న, దస్తప్ప, మల్లేష్, శరణయ్య నర్సిములు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: చిట్టిఘనాపూర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# మత సామరస్యానికి తాండూరు వేదిక

- ఉపవాస దీక్షలకు ఆటంకాల్లేకుండా ఏర్పాట్లు
- ఈ నెల 23న క్లాసిక్ గార్డెన్లో ఇఫ్తార్ విందు
- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎమ్మార్

**తాండూరు:** మత సామరస్యానికి తాండూరు వేదికగా నిలిచిందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాండూరు ముస్లిం మతస్తులు, నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పండుగకు మరో పక్షం రోజులు ఉందన్నారు. ఉపవాస దీక్షలు చేపట్టిన వారికి మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. పండుగ రోజు ముస్లింలు ఈద్గాలలో ప్రార్థనలు చేస్తారని అందుకోసం వాటిని శుభ్రం చేయించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. మతసామరస్యం చాటేందుకు తను ముస్లిం మతస్తులకు ఈ నెల 23వ తేదీన క్లాసిక్ గార్డెన్లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముస్లింలు ఈ విందుకు పెద్ద ఎత్తున హాజరవ్వాలని, దీనికి మతపెద్దలు కూడా సహకరించాలని కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, అబ్దుల్ రవూఫ్, సర్దార్‌ఖాన్, జుబేర్‌లాల, జలాల్ పాల్గొన్నారు.

**మహిళలకు పెద్దపీట..**

ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్‌సీ ఫాక్స్‌కాన్ కంపెనీ వారి సౌజన్యంతో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కంపెనీ ప్రతినిధులు ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జాబ్‌మేళాకు మొత్తం 400 మందిపైగా మహిళలు హాజరయ్యారు. దీంతో 200 మంది ఉద్యోగానికి అర్హత సాధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాండూరు నియోజకవర్గంలోని మహిళలు ఉద్యోగాల కోసం పెద్ద ఎత్తున ముందుకు రావడం అభినందనీయన్నారు. ఉద్యోగాలు రాని మహిళలు నిరాశ చెందొదన్నారు. భవిష్యత్‌లో స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఫాక్స్‌కాన్ కంపెనీపై తనకు పూర్తి స్థాయి అవగహన ఉందన్నారు. ఈ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైన మహిళలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కంపెనీ చూసుకుంటుందన్నారు. స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చే యిస్తున్నామన్నారు. వ్యవసా య మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల నీరజాబాల్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.